మంకు పట్టుపట్టి లేవలేదు. చివరికి రుక్మిణమ్మే స్వయంగా వెళ్ళి "అవతల మూడుముళ్ళు పడే వేళయింది, లేరా" అని బ్రతిమాలితే "ఇవతల మూడుఆసులుపడే లగ్నంకూడా మించిపోతుం"దని భీష్మించుకు కూర్చున్నాడు. కొడుకు చేస్తున్న తప్పు తనదే అన్నట్లు బాధపడి మరిపందిట్లో ఉండలేక వంటశాలలోకి వెళ్ళిపోయింది రుక్మిణమ్మ

'ఇలాంటి వాడికి ఎవరు పిల్లనిస్తారు? ఇంతకీ కర్మ, కర్మ' అనుకుంది. ఆమెగుండె కాలుతూన్న స్టౌలో వుండే మధ్య బిళ్ళలా ఎర్రగా మండుతున్నాది ముసుగు సవరించుకుంటూ పందిట్లోంచివచ్చే హాయిహోవలాంటి వేదఘోషతో పాటు తన లోపటిగొంతును మేళవించి "ధృవంతే రాజా వరుణో ధృవం దేవో బృహస్పతిః-ధృవంత ఇంద్రశ్చా-అగ్నిశ్చరాష్ట్రం ధారయతాం ధృవం?" అని మంత్రం వల్లించుకొంది. వరుడి చేత వధువు నెత్తిమీద జీలకర్రా బెల్లం పెట్టిస్తున్నారు. "ధృవం! ధృవం! అవును వెంకట్రాముడికి ఆరుపోగులూ పడవు ధృవం!" అనుకొంది రుక్మిణమ్మ.

ఆమె వంటశాలలో కాలుగాలిన పిల్లిలా తిరగడం చూసి వంట బ్రాహ్మణుడు "ఏం వదినా! మనమరాలి పెళ్ళి అవుతూవుంటే నువ్వు వంటింట్లో ఉండిపోయావు? వెళ్ళమ్మా వెళ్ళు. నీ కేం బెంగా అక్కర్లేదు. నేను నడుంకట్టేక ఎన్ని గుండిగలేనా ఇట్టే వార్చేస్తాను. అయినా ఈ రేషను రోజుల్లో వంట లేం వంటలు? పట్టుమని పది గుండిగలేనా వార్చేకర్లేదు. బూరెలా? ఈరోజుల్లో కుర్రాళ్లు రెండు

